క్లుప్తంగా

ఇళ్ల పన్నులు వసూలు చేయాలి



ఇళ్ల పన్నుల వసూలుపై సూచనలిస్తున్న పంచాయతీ విస్తరణాధికారి

వేపాడ: పంచాయతీల్లో ఇళ్ల పన్నులు శత శాతం వసూలు చేయాలని పంచాయతీ విస్తరణాధికారి సీహెచ్ సూర్యనారాయణ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గుడివాడలో సర్పంచ్ గోపి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వలంటీర్ల సహాయంతో ఇళ్ల పన్నులు వసూలు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛ సంకల్పం తదితర అంశాలపై వివరించారు.

కేజీబీవీ సందర్శన



కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వేదవతి

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలో ఎస్సీ బాలికల వసతిగృహంతో పాటు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంపీడీఓ వేదవతి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగాగా విద్యార్థులద్దేశించి మట్లాడుతూ విద్యార్థులకు ప్రస్తుతం పరీక్షల సమయం వచ్చిందని ప్రణాళిక ప్రకారం చదివితే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు అందించే మెను ప్రకారం ప్రతి రోజు భోజనాలను పెట్టాలని చెప్పారు. ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారిణి పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్పంపై అవగాహన

వేపాడ: మండలంలోని బొద్దాంలో పంచాయతీ కార్యదర్శి పద్మావతి ఆధ్వర్యంలో గ్రామస్తులకు స్వచ్ఛ సంకల్పంలో భాగంగా తడి, పొడి చెత్త వేయటంపై ఇంటింటికి వెళ్లి మంగళవారం అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త వేరు చేసి వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



పాటూరులో విద్యార్థులను ప్రశ్నిస్తున్న ఎంఈఓ

వేపాడ: మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ జి.శ్రీదేవి మంగళవారం సందర్శించి పరిశీలించారు. బొద్దాం, పాటూరు పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు, లెసెన్ ప్లాన్స్, రైటింగ్ బుక్స్ తదితర వాటిని పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. నోట్స్‌లను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు నిర్వహణ పరిశీలించి విద్యార్థులను భోజనం ఎలా వుందని అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకులు రుచి, నాణ్యత పాటించి పిల్లలకు భోజనం పెట్టాలని, మెనూ అమలు చేయాలని సూచించారు.

ప్రారంభమైన ముత్యాలమ్మ తీర్థ మహోత్సవాలు

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో పలు ట్రాక్టర్లతో బండ్ల వేషాలు ప్రదర్శించారు. శ్రీ కృష్ణార్జులు, ఆంజనేయస్వామి, శ్రీరామపట్టాభిషేకం, లవకుశలు తదితర వేషాలతో పలువురును ఆకట్టుకున్నాయి. వల్లంపూడి ఎస్ఐ రాజేష్ అమ్మవారిని దర్శించుకున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన తీర్థ మహోత్సవాలు పురస్కరించుకుని బుధవారం మధ్యాహ్నం గుర్రాల పరుగు ప్రదర్శన, గురువారం ఎడ్లు పరుగు ప్రదర్శన వుంటాయన్నారు.



సోంపురంలో అమ్మవారి ఆలయానికి వెళ్తున్న బండ్ల వేషాలు

ఒకరికి గాయాలు

జామి: మండలంలోని కె.భీమసింగి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. అనకాపల్లికి చెందిన బి.చందు గంట్యాడ నుంచి బైక్‌పై తిరిగి వస్తున్న సమయంలో కె.భీమసింగి వద్ద ప్రమాదం జరిగి గాయపడ్డాడు. బైక్ అదుపు తప్పిందా.. ఏదైనా వాహనం ఢీకొట్టిందా అనేది తెలియరాలేదు. క్షతగాత్రుడిని 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జోరుగా ఎన్నికల ప్రచారం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు మంగళవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల నాయకులు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు.

– సాక్షి నెట్‌వర్క్



గుర్ల: కేజీబీవీలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీటీసీ శ్రీనివాసరావు



చీపురుపల్లి: సెగిడివీధిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బొండపల్లి: రాచకిండాంలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ చల్ల చల్లంనాయుడు

శిక్షణ అనంతరం ఉపాధి

చీపురుపల్లి: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భారత్ డైనమిక్ లిమిటెడ్ సంస్థ సౌజన్యంతో మహిళల కోసం ఇస్తున్న కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని భారత్ డైనమిక్ లిమిటెడ్ సంస్థ డీజీఎం సీహెచ్.విక్రమ్ అన్నారు. పట్టణంలోని డీఆర్‌డీఏ భవనంలో మహిళలకు జరుగుతున్న కుట్టు శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. శిక్షణ ఎలా జరుగుతోంది, సౌకర్యాలు ఎలా ఉన్నాయి, మధ్యాహ్న భోజన వసతిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు ఇక్కడ కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డీపీఎం మార్టిన్, ఏపీఎమ్ ఎంవి.రాజశేఖర్ పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ కేంద్రంలో మహిళలతో మాట్లాడుతున్న డీజీఎం విక్రమ్

ఈఎస్ఐ సేవలపై అవగాహన



ఈఎస్ఐపై కార్మికులకు అవగాహన కల్పిస్తున్న బీఎం శ్రీనివాసరావు

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి గ్రామ సమీపంలో గల శారద మెటల్స్ అండ్ ఎలోయిస్ లిమిటెడ్ కర్మాగారంలో కార్మికులకు ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సేవలపై విజయనగరం బ్రాంచ్ మేనేజర్ పి.శ్రీనివాసరావు మంగళవారం అవగాహన కల్పించారు. ఈఎస్ఐ ద్వారా కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు, అలాగే ఆస్పత్రిలో చేరని కార్మికులకు పరిహారం, సెలవులు మంజూరు తదితర అంశాలపై కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కర్మాగార ప్రతినిధులు గుల్లిపల్లి శంకరరావు పాల్గొన్నారు.

ఇళ్ల బిల్లుల చెల్లింపులో జాప్యం వద్దు

దత్తిరాజేరు:

ఇళ్లు నిర్మిస్తున్న వారికి శ్లాబుల వారీగా అందజేసే బిల్లుల చెల్లింపులో జాప్యం జరగకూడదని హౌసింగ్ ఈఈ శ్రీనివాసరావు అన్నారు. మహిళా సమాఖ్య కార్యాలయంలో గ్రామ సచివాలయ ఇంజినీర్లతో మంగళవారం జరిగిన సమావేశంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, డీఈ సత్యనారాయణతో కలిసి మాట్లాడారు. ఫిబ్రవరి 9వ తేదీ వరకు నిర్మాణాలు పూర్తయిన వారందరికి బిల్లుల చెల్లింపులు చేపట్టిందని, మిగతా వారికి కూడా త్వరలో వారి ఖాతాలో నగదు జమ చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో పలువురు అధికారులు, సచివాలయ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై తస్మాత్...

కొత్తవలస: సైబర్ నేరాలపై ముఖ్యంగా విద్యార్థులు అప్రమత్తంగా వుండాలని కొత్తవలస సీఐ ఎస్.బాలసూర్యారావు సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ బాలసూర్యారావు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో సైబర్ నేరగాళ్లు పెట్రేగిపోతున్నారని, వీరి బారిన పడి చాలా మంది డబ్బులు పోగొట్టుకొని నష్టపోతున్నారని తెలిపారు. గుర్తు తెలియని నంబర్ల కాల్స్, మెసేజ్‌లపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. దిశా యాప్ వినియోగంపై పిల్లలకు వివరించారు. తహసీల్దార్ డి.ప్రసాద్‌రావు, పాఠశాల హెచ్‌ఎం బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ బాలసూర్యారావు

పోలింగ్ ఏర్పాట్లు పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్, సీఐలు

కొత్తవలస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి కొత్తవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల నిర్వహణ ఏర్పాట్లను తహసీల్దార్ డి.ప్రసాద్‌రావు, సీఐ బాలసూర్యారావు, రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రసాద్‌రావు మాట్లాడుతూ మండలంలోని 2339 పట్టభద్రుల ఓట్లు వున్నట్లు తెలిపారు. వీరు ఓటు వేసేందుకు 144, 145 నంబర్లు రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. పట్టభద్రులకు సంబంధించి ఓటర్ స్లిప్‌ల పంపిణీ నేటికి 80 శాతం పూర్తయినట్లు తెలిపారు. సీఐ బాలసూర్యారావు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద 12వ తేదీ నుంచే 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. సజావుగా పోలింగ్ జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ బొడ్డు దేవి, ఆర్ఐ నెక్కలి కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాతో ఉపాధి అవకాశాలు

చీపురుపల్లి: జాబ్‌మేళాతో యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా కలుగుతాయని వాటిని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.బి.గోవిందరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళా నిరుద్యోగులు కోసం జాబ్‌మేళా నిర్వహించారు. ఇ జాబ్‌మేళాకు క్యాడ్‌బరీ ఇండియా లిమిటెడ్ పరిశ్రమ నుంచి ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్ మేళాకు 69 మంది హాజరవ్వగా అందులో ఐదుగురు మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ టి.రామకృష్ణ, అధ్యాపకులు పి.మల్లేశ్వరరావు, ఎ.చంద్రమౌళి, జి.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

- జూనియర్ సివిల్ జడ్జి విజయరామేశ్వరి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి విజయరామేశ్వరి

చీపురుపల్లి: మహిళలకు ప్రస్తుతం ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని అన్ని రంగాల్లోను ముందుండాలని స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయరామేశ్వరి చెప్పారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని లైన్స్ క్లబ్ హాలులో అంగన్‌వాడీ వర్కర్స్‌కు న్యాయ విజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ప్రశాంతంగా జీవించేందుకు చట్టాలు చేయబడ్డాయని చెప్పారు. మహిళలకు సమాజంలో పూర్తి స్థాయిలో హక్కులు ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని వ్యక్తిగత అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు దాసరి రఘుపతినాయుడు, కె.నాగేశ్వరరావు, కె.సింహాచలం, ఎం.లక్ష్మణరావు, జాన్సీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం ఉంటే వెంటనే కొనుగోలు

మెరకముడిదాం: కొనుగోలుకు ధాన్యం ఉంటే వెంటనే కొనుగోలు చేయాలని సీఎస్‌డీటీ పిన్నింటి రామారావు మండలానికి చెందిన అగ్రికల్చరల్ అసిస్టెంట్లకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలానికి సంబంధించి ధాన్యం కొనుగోలు దాదాపుగా పూర్తయినప్పటికీ ఇంకా రైతులకు సంబంధించిన ధాన్యం ఎక్కడ వున్నా వారి నుంచి కొనుగోలు చేయాలన్నారు. అనంతరం వ్యవసాయ శాఖాధికారిణి శ్రావణితేజ మాట్లాడుతూ రైతుల ఉంచి సేకరించిన ధాన్యం సకాలంలో మిల్లులకు చేర్చిన వెంటనే ఆన్‌లైన్ చేసి ఆ డబ్బులు వారి అక్కౌంట్లలో పడేటట్టు చర్యలు చేపడుతుండాలన్నారు. పలువురు అగ్రికల్చరల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రతిపక్ష పాత్ర పోషించలేని టీడీపీ

శృంగవరపుకోట : ప్రభుత్వాన్ని ప్రశ్నించేవి బీజేపీ, జనసేన పార్టీలేనని, ప్రతిపక్ష తెలుగుదేశం తన పాత్ర సరిగా నిర్వహించడం లేదని రాజ్యసభ సభ్యులు జీ.వి.ఎల్.నరసింహారావు చెప్పారు. ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో బీజేపీ, జనసేన నాయకులతో కలిసి ఎమ్మెల్సీ ఎలక్షన్ క్యాంపెయిన్‌లో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పట్టభద్రులను ఉద్దేశించి మాట్లాడారు. పట్టభద్రుల ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని సభల్లోకి పంపాలని కోరారు. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్న తపన ఇక్కడి నాయకుల్లో లేదన్నారు.